సాక్షి అనంతపురం

శనివారం ၊ 14 ၊ డిసెంబర్ ၊ 2024



చీనీ టన్ను రూ.29 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.29 వేలు పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.10 , కనిష్టం రూ.4 , సరాసరి రూ.6 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

31.9°/20.7°

జిల్లాలో శుక్రవారం తుపాను వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి వాతావరణం కొనసాగుతోంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.



కలెక్టరేట్ ఎదుట రైతులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన ప్రదర్శన



ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న కర్షకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

దగాపై దండయాత్ర

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాతల భారీ ర్యాలీ

- జెడ్పీ నుంచి కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన
- వేలాదిగా తరలివచ్చిన రైతులు, ప్రజలు
- ప్రభుత్వ తీరును ఎండగట్టిన నాయకులు
- అన్నదాతలను ఆదుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

కర్షకలోకం కదలి తరంగమై కదలివచ్చింది. అనంతపురంలో కవాతు నిర్వహించింది. హామీలిచ్చి మోసం చేసిన కూటమి సర్కారుపై ధ్వజమెత్తింది. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు వెంటరాగా.. జెడ్పీ కార్యాలయం వద్ద నుంచి కలెక్టరేట్ వరకూ గర్జన చేసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం అన్నదాతలకు అండగా అనంతపురంలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది.

అనంతపురం కార్పొరేషన్: రైతు సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, అన్నదాతలకు అండగా నిలిచేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కేంద్రమైన అనంతపురంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించింది. రైతులు, ప్రజలు నిరసన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆరు నెలల కూటమి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత స్పష్టమైంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయం వద్దకు ఎమ్మెల్సీలు మంగమ్మ, శివరామిరెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి, తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త పెద్దారెడ్డి, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, శింగనమల సమన్వయకర్త వీరాంజినేయులు, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, రాయదుర్గం మునిసిపల్ చైర్‌పర్సన్ శిల్పా, గుంతకల్లు వైస్‌చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, టాస్క్ ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ నారాయణ, పార్టీ ముఖ్యనేతలు అనంత చంద్రారెడ్డి, ఉమామహేశ్వర్‌నాయుడు, సాకే చంద్ర, తదితరులు చేరుకున్నారు. మొదటగా జిల్లా అధ్యక్షుడు అనంతతో పాటు సమన్వయకర్తలు.. అంబేద్కర్, మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీ నుంచి సప్తగిరి సర్కిల్, సూర్యనగర్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ సాగింది. మొదటి నుంచి చివరి వరకూ ర్యాలీ జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు జరిగిన అన్యాయానికి సంబంధించిన ప్లకార్డులను ర్యాలీలో ప్రదర్శించారు. రెట్టింపు ఉత్సాహంతో పార్టీ శ్రేణులు తరలివచ్చారు. అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మకు 8 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట ప్రచార రథంపై జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్తలు ప్రసంగించారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, నియోజకవర్గ సమన్వయకర్తలు విశ్వ, రంగయ్య, మెట్టు, పెద్దారెడ్డి, వీరాంజనేయులు, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎంపీ మాధవ్ తదితరులు

ఇవీ వైఎస్సార్‌సీపీ డిమాండ్లు

- అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందజేయాలి.
- వరి, వేరుశనగ, మొక్కజొన్న, కంది, ఆముదం, పత్తి, తదితర పంటలను మద్దతు ధరకు అనుగుణంగా కొనుగోలు చేయాలి. అందుకు ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- రైతులపై ప్రీమియం భారం వేయకుండా ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలి.
- రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ డ్రిప్, స్ప్రింక్లర్లు పంపిణీ చేయాలి.
- ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా కింద పరిహారం చెల్లించాలి. 2023 రబీలో కరువు జాబితాలో ప్రకటించిన 17 మండలాల రైతులకు రూ.32 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి.
- వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలో దళారుల ప్రమేయాన్ని అరికట్టాలి.
- రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే విత్తనాలు, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్‌ను ఎమ్మార్పీ ధరకే అందించేలా చర్యలు తీసుకోవాలి.

ఎటు చూసినా అరాచకాలే..



రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు, దోపిడీలు, దొంగతనాలే. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఐదు క్లబ్‌లు ఉన్నాయి. విచ్చలవిడిగా మట్కా , బంగాకు విక్రయాలు సాగుతున్నాయి. ఆరు నెలలుగా తాడిపత్రికి వెళ్లాలని పోలీసులకు విన్నవిస్తే శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని చెబుతున్నారు. నేను లేకున్నా తాడిపత్రిలో దాడులు చేయడం లేదా? రైతులకు మేలు చేయాల్సింది పోయి ఇసుక, బూడిద కోసం ప్రజాప్రతినిధులు గొడవ పడుతున్నారు. చంద్రబాబు ఎమ్మెల్యేలపై నిఘా పెట్టాలి.

– కేతిరెడ్డి పెద్దారెడ్డి, తాడిపత్రి సమన్వయకర్త

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



కూటమి ప్రభుత్వం తిరుపతి లడ్డూ నుంచి కాకినాడ ఓడరేవు వరకూ డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలాన్ని వెళ్లదీస్తోంది. సూపర్ సిక్స్ హామీలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. సంపద సృష్టిస్తామని ఇసుక, మట్టి, బూడిదతో బడా కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తోంది ప్రభుత్వం. కూటమి ప్రభుత్వంలో ప్రజల కోసం రోడ్డెక్కినా..మాట్లాడినా..ఏం చేసినా కేసులను బహుమతిగా ఇస్తున్నారు. లడ్డూ అంశంలో కళ్యాణదుర్గంలో ర్యాలీ చేస్తే నాతో పాటు 47 మందిపై కేసు నమోదు చేశారు.

– తలారి రంగయ్య , కళ్యాణదుర్గం సమన్వయకర్త

ఆరు నెలల్లో ఏం చేశారో చెప్పండి



కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్నా ఆదుకునే పరిస్థితి మాత్రం లేదు. కేవలం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేసేందుకే కూటమి నాయకులు సమయాన్ని వృథా చేస్తున్నారు. డైవర్షన్ పాలిటిక్స్ తప్ప ఆరు నెలల్లో ఏం చేశారో చెప్పే పరిస్థితిలో లేరు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 99 శాతం హామీలను వైఎస్ జగన్ అమలు చేశారు. మీరెన్ని హామీలు అమలు చేశారో చెప్పాలి.

– విశ్వేశ్వరరెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త

ప్రత్యక్ష పోరాటానికి సిద్ధం



కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడిచినా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. సమస్యలను పక్కదారి పట్టించే యోచనలో ఉన్న ప్రభుత్వానికి హెచ్చరిక చేయడానికే వివిధ డిమాండ్లతో వేలాది మందితో ర్యాలీని చేపట్టాం. పంటలు సరిగా పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. ర్యాలీ చేస్తున్నామని తెలియడంతో మద్దతు ధర పేరుతో ఇక్కడ ఫ్లెక్సీలు వేయడం కాదు.. ప్రకటించిన మొత్తాన్ని ఇవ్వాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 అందజేశాం. ఐదేళ్ల కాలంలో జిల్లా రైతాంగానికి ఏకంగా రూ.1900 కోట్లు పెట్టుబడి సాయంగా అందింది. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పినా ఇంత వరకూ ఇవ్వలేదు. ఎరువులు, పురుగు మందులను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారు. ఎంఆర్‌పీకే రైతులకు విక్రయించాలి. నకిలీ బయో ప్రొడక్ట్స్ మార్కెట్‌లో విపరీతంగా ఉన్నాయి. వాటిని లేకుండా చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై వ్యాపారులతో రైతులు పండించిన పంటకు ధర కల్పించడం లేదు. రైతులను నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదు. ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమై ప్రభుత్వం మెడలు వంచైనా రైతులకు అండగా నిలుస్తాం.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

కేసులకు భయపడేది లేదు



సీఎం చంద్రబాబు హయాంలో ఫ్లెక్సీలు, మాటలు, కాగితాలకు మాత్రమే హామీలు పరిమితమవుతాయి. ప్రజలకు మేలు చేసేదేమీ ఉండదు. రైతుకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇవ్వాలని, రైతులకు న్యాయం చేయాలని ర్యాలీ చేపడితే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఫ్లెక్సీ రాజకీయానికి తెరలేపారు. కేవలం ఆరు నెలల్లోనే బాబు పాలనతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కనిపించిన ప్రతి ఒక్కరికి రూ.15 వేలు, రూ.18 వేలు అంటూ అధికారంలోకి వచ్చిన బాబు ప్రజలకు ఏమీ చేయలేదు. మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు పట్టించుకోవడం లేదు. ప్రజల కోసం పోరాటం చేస్తున్న వారిపై కేసులు పెట్టినా ఎవరూ భయపడరు. రెట్టింపు ఉత్సాహంతో ప్రభుత్వంపై పోరాడతారు.

– శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ







ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం, ర్యాలీలో పాల్గొన్న అనంత, విశ్వ, శివరామిరెడ్డి, మహాలక్ష్మి శ్రీనివాస్ తదితరులు, పెట్టుబడి సాయం అందించాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య

అన్నం పెట్టే రైతుకు సున్నం



రాష్ట్రంలో వైట్‌కాలర్ అఫెండర్స్, ఎల్లో మీడియా, రెడ్ బుక్.. ఈ మూడు రంగులు రాష్ట్రాన్ని ఏలుతున్నాయి. దివంగత నేత వైఎస్సార్ రైతాంగానికి పెద్దపీట వేస్తే.. సీఎం చంద్రబాబు అన్నం పెట్టే రైతుకు సున్నం పెడుతున్నాడు. జమిలి ఎన్నికలు వస్తున్నాయి. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

– గోరంట్ల మాధవ్ , మాజీ ఎంపీ

ప్రభుత్వ సాయం ఏదీ?



జిల్లాలో రైతాంగం పరిస్థితి దయనీయంగా ఉంది. కణేకల్లు, బొమ్మనహాల్ ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అన్నదాత సుఖీభవ గురించి చంద్రబాబు పట్టించుకోవడం లేదు. పంటలకు మద్దతు ధర ఇచ్చి, ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– మెట్టు గోవిందరెడ్డి, రాయదుర్గం సమన్వయకర్త

రైతులు నరకం చూస్తున్నారు



కూటమి ప్రభుత్వం వస్తే రైతులకు పెట్టుబడి రూ.20 వేలు ఇస్తామని మోసం చేశారు. ఆరు నెలల్లో ఒక్క హామీని నెరవేర్చలేదు. గతంలో రైతులు నష్టపోతే వారిని అప్పటి సీఎం జగనన్న ఆదుకున్నారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేక రైతులు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. రైతులను నిర్లక్ష్యం చేయడం తగదు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ఇది అప్రజాస్వామిక పాలన



కూటమి ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోంది. అన్ని వర్గాల వారికి మేలు చేస్తామని అధికారం చేపట్టి ఆరు నెలలవుతున్నా ఒక్క హామీ నెరవేర్చలేదు. అప్రజాస్వామిక పాలనతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– వీరాంజనేయులు, శింగనమల సమన్వయకర్త

అబద్ధాల కోరులు బాబు, పవన్



ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అబద్ధాల కోరులు. చెప్పిన హామీలను విస్మరించారు. వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. ప్రజల పక్షాన పోరాటాలు కొనసాగిస్తాం.

– ఉమామహేశ్వర్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నేత, కళ్యాణదుర్గం

వైఎస్ కుటుంబమెప్పుడూ రైతు పక్షమే



రాష్ట్ర చరిత్రలో రైతన్న కుటుంబాలకు అండగా నిలిచింది వైఎస్సార్ కుటుంబమే. మహానేత వైఎస్సార్ హయాంలో ఎన్నో పథకాలు తీసుకువచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాలు, ఇన్సూరెన్స్ తదితర వాటిని ప్రవేశపెట్టి రైతులను ఆదుకున్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది.

– రమేష్‌గౌడ్ , టాస్క్‌ఫోర్స్ ప్రతినిధి

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

- పకడ్బందీగా నిర్వహిస్తామన్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో సాగునీటి సంఘాలకు ఎన్నికల ప్రక్రియ శనివారంతో పూర్తవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ఎన్నిక, సంఘాల అధ్యక్షుల, ఉపాధ్యక్షుల ఎన్నిక శనివారంతో పూర్తవుతుందన్నారు. 17వ తేదీన సర్వసభ్య సమావేశాలు నిర్వహించి డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులను ఎన్నుకుంటారని తెలిపారు. జిల్లాలో మొత్తం 149 సాగునీటి వినియోదారులు సంఘాలు, 6 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయని వెల్లడించారు. భారీ నీటి పారుదలలో 54 సాగునీటి వినియోదారుల సంఘాలు, 648 ప్రాదేశిక నియోజకవర్గాలు, మధ్య తరహా నీటి పారుదలలో 6 సాగునీటి వినియోదారుల సంఘాలు, 72 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయని పేర్కొన్నారు. అదే విధంగా చిన్న నీటి పారుదలలో 89 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 534 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. వీటి ఎన్నికల నిర్వహణకు వివిధ శాఖల నుంచి సిబ్బందిని నియమించడంతో పాటు శిక్షణ కూడా ఇచ్చామన్నారు. ఓటరుగా నమోదైన వారు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

జర్నలిస్టులపై దాడులు చేయడం దుర్మార్గం

- ముక్తకంఠంతో ఖండించిన జర్నలిస్టు సంఘాలు
- నేడు జెడ్పీ కార్యాలయం వద్ద నిరసన

అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం: జర్నలిస్టులపై రాజకీయ నాయకుల దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ఆపకపోతే తాము కూడా ప్రతిఘటించాల్సి ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీడబ్ల్యూజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్ జిల్లాలో 'సాక్షి' విలేకరులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం మచ్చా రామలింగారెడ్డి అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. రాజకీయ నాయకులు, సినిమా స్టార్లకు జర్నలిస్టులపై దాడులు చేయడం ఫ్యాషన్‌గా మారిందన్నారు. మీడియా అండతో ఎదిగిన మంచు ఫ్యామిలీ టీవీ–9 రిపోర్టర్‌పై దాడి చేయడం హేయమన్నారు. ఇటీవల గుంతకల్లులో ఐన్యూస్ ప్రతినిధిపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. జర్నలిస్ట్‌లపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదన్నారు.

టీడీపీ గూండాలను అరెస్టు చేయండి

వైఎస్సార్ కడప జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల కవరేజీకి వెళ్లిన సాక్షి టీవీ విలేకరి శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, సాక్షి పత్రిక రిపోర్టర్ రాజారెడ్డిలపై దాడి చేసిన టీడీపీ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) రాష్ట్ర కార్యదర్శి కొత్తపల్లి అనిల్‌కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై అమానుషంగా దాడి చేసి, వారి వద్ద ఉన్న కెమెరాలను, సెల్‌ఫోన్లను లాక్కొని పగులగొట్టడం తీవ్రంగా పరిగణించి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు నిరసన ప్రదర్శనలు

జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నిరసనగా జెడ్పీ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఉదయం 10:30 గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని ఐక్య జర్నలిస్ట్ సంఘాల నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామికవాదులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న మచ్చా రామలింగారెడ్డి

క్లుప్తంగా

ముగిసిన పౌరరక్షణ వలంటీర్ల శిక్షణ



డిఫెన్స్ వలంటీర్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీఆర్ఎం విజయ్‌కుమార్

గుంతకల్లు: విపత్తుల సమయంలో పౌరరక్షణ (డిఫెన్స్) వలంటీర్లు అందిస్తున్న సేవలు అమోఘమని డీఆర్ఎం విజయ్‌కుమార్ కొనియాడారు. దక్షిణ మధ్య రైల్వే సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 62వ ఆల్ ఇండియా సివిల్ డిఫెన్స్ అన్యువల్ డే ముగింపు కార్యక్రమాన్ని స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఆర్ఎంతో పాటు ఏడీఆర్ఎం సుధాకర్, దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌నాథ్‌కొట్లా, డిప్యూటీ సెక్రటరీ కేఎల్ఎన్ స్వామి, సివిల్ డిఫెన్స్ ఎమర్జెన్సీ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, డిప్యూటీ కంట్రోల్ ఆఫ్ సివిల్ అండ్ డిఫెన్స్ ఎన్.చెజియన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైల్వే సివిల్ డిఫెన్స్ జెండా ఆవిష్కరించి, వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డిఫెన్స్, సివిల్ దళం, వలంటీర్లు, రైల్వే రక్షణ దళం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా సివిల్ డిఫెన్స్ వలంటీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డీఆర్ఎం మాట్లాడుతూ ఈ ఏడాది వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో డిఫెన్స్ ఉద్యోగులు, వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ క్యాప్రిల్ ఆరోరా, సీనియర్ డీసీఎం మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచింగ్‌కు విఫలయత్నం

పామిడి: స్థానిక జేపీ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం రాత్రి జరిగిన రిసెప్షన్‌కు హాజరై తిరిగి వెళ్తున్న మహిళ మెడలోని బంగారు ఆభరణాలను లాక్కెళ్లేందుకు ఓ దుండగులు విఫలయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఈ నెల 11న జరిగిన రిసెప్షన్‌కు మరో ప్రాంతానికి చెందిన దంపతులు కారులో వచ్చారు. వేడుక ముగిసిన తర్వాత బంధువులతో కలసి కారు ఎక్కబోతున్న మహిళ మెడలోని బంగారు నగలను లాక్కెళ్లేందుకు ఓ యువకుడు ప్రయత్నం చేశాడు. అదే సమయంలో అప్రమత్తమైన ఆమె గట్టిగా కేకలు వేయడంతో కారులో ఉన్న భర్త, బంధువులు కిందకు దిగేలోపు సమీప చర్చి వెనుక గల ముళ్లపొదల్లో దూకి తప్పించుకున్నాడు. బాధితుల నుంచి సమాచారం అందుకున్న డయల్ 100 సిబ్బంది అప్రమత్తం చేయడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైన దృశ్యాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కసాపురం.. సింధూర వర్ణమయం



వేలాదిగా తరలివచ్చిన ఆంజనేయస్వామి మాలాధారులతో శుక్రవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సింధూర వర్ణంతో కాంతులీనింది. ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ పురవీధులు మార్మోగాయి. ఆంజనేయస్వామి మాలధారుల మండల దీక్షలు ముగియడంతో శుక్రవారం ఆలయంలో హనుమద్ వ్రతాన్ని శోభాయమానంగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు నిర్వహించిన అర్చకులు... అనంతరం మాలాధారుల ఇరుముడుల ద్వారా సమర్పించిన ద్రవ్యాలతో అభిషేకాలు జరిపారు. ప్రత్యేక పుష్పాలు, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి వేదికపై కొలువుదీర్చారు. హనుమద్‌వ్రతం విశిష్టత, నెట్టికంటి ఆంజనేయస్వామి క్షేత్ర మహిమను వేదపండితులు వివరించారు. అనంతరం మహామంగళహారతితో హనుమద్ వ్రతాన్ని ముగించి భక్తులకు, మాలాధారులకు స్వామి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతోపాటు ఆయన సోదరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.వాణి, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షించారు.

– గుంతకల్లు రూరల్





ప్రత్యేక పుష్పాలంకరణలో కొలువుదీరిన నెట్టికంటి ఆంజనేయస్వామి, ఇరుముడి ద్రవ్యాలతో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని అభిషేకిస్తున్న దృశ్యం, హనుమద్ వ్రతంలో పాల్గొన్న భక్తులు

నిప్పంటుకుని మహిళకు తీవ్ర గాయాలు

గుంతకల్లు రూరల్: కట్టెల పొయ్యి అంటిస్తూ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని మండల పరిధిలోని గుర్రబ్బాడు గ్రామానికి చెందిన లక్ష్మి తీవ్రంగా గాయపడింది. రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు... శరత్‌బాబు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. దంపతులిద్దరూ కట్టెలు కొట్టుకుంటూ, కూలి పనుల ద్వారా జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం లక్ష్మి ఇంట్లో పొయ్యి అంటించేందుకు ఆటో కోసం తెచ్చిన పెట్రోల్‌ను వాడింది. ఆ సమయంలో మంటలు భారీగా ఎగిసిపడి చీరకు అంటుకున్నాయి. మంటల్లో చిక్కుకున్న లక్ష్మిని ఇరుగుపొరుగు వారు గమనించి కాపాడి, గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రాథమిక చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు.

వక్క చెట్లకు నిప్పు

కుందుర్పి: మండలంలోని మలయనూరు గ్రామానికి చెందిన రైతు మణికంఠ తన పొలంలో నాటిన 250 వక్క చెట్లకు దుండగులు నిప్పు పెట్టారు. బాధిత రైతు తెలిపిన మేరకు... శుక్రవారం మధ్యాహ్నం దుండగులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగాయి. మేకల కాపర్లు మంటలను ఆర్పేలోపు 250 చెట్లు కాలిపోయాయి. ఘటనతో రూ.45 వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

అడగడుగునా హక్కుల ఉల్లంఘనే

- బాధితులకు అండగా నిలుస్తున్న మానవ హక్కుల వేదిక
- నేటి నుంచి 'అనంత'లో హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్: సమాజంలో ప్రభుత్వంతో పాటూ ఆధిపత్య వర్గాలు చేస్తున్న హింసను ఏకమై వ్యతిరేకిస్తున్న 'మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్ఎఫ్)' రాష్ట్ర మహాసభలు శనివారం అనంతపురంలో ప్రారంభం కానున్నాయి. తొలిరోజుల్లో పౌరహక్కుల సంఘంతో కలసి పనిచేసినా... అనంతర కాలంలో హింసను ఎవరు ప్రోత్సహించినా తప్పేనన్న నేపథ్యంలో 1998లో రాష్ట్రవ్యాప్తంగా 32 మంది సభ్యులతో మానవ హక్కుల వేదిక ఏర్పడింది. ఇందులో జిల్లాకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, న్యాయవాదులు ఎస్ఎం బాషా, అబ్దుల్ రసూల్, ప్రొఫెసర్ సుధాకర్ తదితరులు జిల్లా శాఖను ఏర్పాటు చేసి ఉద్యమిస్తున్నారు. సమాజంలో అడుగడుగునా ఎదురవుతున్న హక్కుల ఉల్లంఘనపై తమ గళాన్ని వినిపిస్తున్నారు. ఈ క్రమంలోనే హెచ్‌ఆర్ఎఫ్ కార్యక్రమాలపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకువచ్చే దిశగా రాష్ట్ర స్థాయి సభలకు ఈసారి అనంతను వేదికను చేశారు.

నగరానికి విచ్చేసిన జాతీయ నేతలు

నగరంలోని అంబేడ్కర్ భవన్ సమీపంలోని ఆపిల్ ఫంక్షన్ హాలు వేదికగా ఈ నెల 14న మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పలు రాష్ట్రాల నుంచి నాయకులు, ప్రతినిధులు అనంతకు విచ్చేశారు. తొలిరోజు అంతర్గత సమావేశాలు, మేథోమథనం, వివిధ జిల్లాల కార్యవర్గాల ఎంపికలుంటాయి. 15న ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారు. 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు, 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు మాలిని సుబ్రహ్మణ్యం, 'కాషాయీకరణ–కార్పొరేటీకరణ' అంశంపై ఆచార్య కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారు.

ప్రతి మనిషికి విలువలుండాలి



సామాన్యుడి జీవితానికి విలువనివ్వని సమాజంలో మనమున్నాం. వారి హోదాలతో సంబంధం లేకుండా ప్రతి మనిషికి విలువ ఉండాలన్నదే మా సిద్ధాంతం. అలా లేని ప్రతి సందర్భంలో మేము ప్రశ్నిస్తూనే ఉన్నాం. రాజకీయనాయకులకు, అధికారులకు ఒకరకం... సామాన్యుడికి మరోరకమైన చట్టాలు ఉన్నాయి. ఈ వైరుధ్యమెందుకు ఉందో ప్రజలు ప్రశ్నించాలి. ఆ దిశగానే మా పోరాటం. అవగాహన పెంచుకునేందుకు సాగుతున్న రాష్ట్ర మహాసభల్లో అందరూ భాగస్వాములు కావాలి.

– చంద్రశేఖర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు

స్వేచ్ఛకు సంకెళ్లు వద్దు



రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛకు సంకెళ్లను ఎందుకు తగిలిస్తారు. ప్రశ్నించే గొంతును నొక్కినంత మాత్రాన ప్రశ్న ఆగిపోదు. జిల్లాలోని రాయదుర్గంలోని పోలీసుస్టేషన్‌లో ఆత్మహత్య చేసుకున్న ఓ నిందితుడి అంశంలో మేము రాజీలేని పోరాటం చేశాం. అలాగే రైతుల విషయంలో, అక్రమ మైనింగ్ విషయంలో ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నాం. మా పోరాటంతో కొంత వరకైనా దుశ్చర్యలను అడ్డుకోగలుగుతున్నాం. రాష్ట్ర మహాసభల్లో అందరూ పాల్గొనండి.

– అబ్దుల్ రసూల్, సీనియర్ న్యాయవాది

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

యల్లనూరు: మండలంలోని చిలమకూరు ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి రాతిదూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలను సర్పంచ్ పెద్దనాగరాజు, అర్చకుడు బాలాంజనేయ స్వామి ప్రారంభించారు. 17 జతల వృషభాలు పోటీలో పాల్గొన్నాయి. బాపట్ల జిల్లా సంతమగులూరు గ్రామానికి చెందిన రైతు వజ్రాల తేజశ్రీ రెడ్డి వృషభాలు 4,508 అడుగుల దూరం లాగి మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన రైతు బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు రెండో బహుమతి, సింగనగుంట్ల గ్రామానికి చెందిన జూటూరు రామకృష్ణారెడ్డి వృషభాలు మూడో బహుమతి, నంద్యాల జిల్లా కొత్తకోట డాక్టర్ గురునాథ్ వృషభాలు నాల్గో బహుమతి, కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గోపాలగౌడ్ వృషభాలు ఐదో బహుమతి, నంద్యాల జిల్లా పెండేకల్లు గ్రామానికి చెందిన నాగభూషణం వృషభాలు ఆరో బహుమతి, మల్లెలరాజు వృషభాలు ఏడో బహుమతి, పెద్దచెర్ల గ్రామానికి చెందిన చెన్నకేశవ వృషభాలు ఎనిమిదో బహుమతి గెలుచుకున్నాయి. విజేత వృషభాల యజమానులను నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కాగా, ఆంజనేయ స్వామి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు పెద్ద ఎత్తున్న జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన వసతిని ఏర్పాటు చేశారు. రాత్రికి నిర్వహించిన నాటక ప్రదర్శన భక్తులను అలరించింది.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

- పీఎంఎఫ్ఎంఈ కింద 35 శాతం రాయితీ
- ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: స్వయం సమృద్ధి సాధించే క్రమంలో ఆహారశుద్ధికి సంబంధించి కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రాయితీలు అందిచనున్నట్లు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) బీఎంవీ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) కింద వ్యాపారవేత్తలు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, ఎఫ్‌పీఓలు, రైతు సహకార సంఘాలు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. చిన్నపాటి కుటీర పరిశ్రమల ఏర్పాటు వల్ల స్వయం సమృద్ధి సాధించడంతో పాటు నలుగురికి ఉపాధి కల్పించాలనేదే పథకం ముఖ్య ఉద్దేశ్యం. ప్రాజెక్టు విలువలో 10 శాతం లబ్ధిదారులు భరిస్తే...35 శాతాన్ని రాయితీ రూపంలో ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగిలిన 55 శాతం బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తారు. ఇందులో గరిష్టంగా రూ.10 లక్షల వరకు రాయితీ వర్తిస్తుంది. జిల్లాలో వేరుశనగ ఆధారిత ఉత్పత్తుల తయారీ యూనిట్లు అంటే వేరుశనగ నూనె, చిక్కీల తయారీ లాంటికి ప్రాధాన్యత ఇస్తూనే... పొటాటో చిప్స్, చెక్కిలాలు, ఊరగాయలు, రోటీ మేకర్, రెడీ టు ఈట్ ప్రొడక్ట్స్, శనగపప్పు, బేకరీ ఉత్పత్తులు, మిల్లెట్ ఆధారిత ఉత్పత్తులు, బొరుగులు, రైస్ బేస్డ్ ప్రొడక్ట్స్, అరికానట్స్, చింతపండు తదితర మరో 20 నుంచి 30 రకాల ఉత్పత్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు అందించనున్నారు. పూర్తి వివరాలకు ఫుడ్ ప్రాసెసింగ్ జిల్లా రీసోర్స్ పర్సన్ బి.హరీష్ (96767 96974)ను సంప్రదించవచ్చు.

'హంద్రీ–నీవా'లో యువకుడి గల్లంతు



ఆదికేశవరెడ్డి (ఫైల్)

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి క్షేత్ర దర్శనానికి వచ్చిన ఓ యువకుడు హంద్రీ–నీవా కాలువలో గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి కుమారుడు ఆదికేశవరెడ్డి (19) హనుమద్ వ్రతంలో పాల్గొనేందుకు గురువారం రాత్రే కసాపురం చేరుకున్నాడు. రాత్రి ఆలయ సమీపంలో నిద్రించిన ఆయన.. శుక్రవారం ఉదయం స్నేహితులతో కలసి స్నానం చేసేందుకు సమీపంలోని హంద్రీ–నీవా కాలువకు వెళ్లాడు. అక్కడ నీటి ప్రవాహం ఉధృతిని గమనించక ఈత కొట్టేందుకు ప్రయత్నించిన ఆదికేశవరెడ్డి... ఉన్నఫలంగా కొట్టుకుపోయాడు. గమనించిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఉపాధ్యాయులు

రాయదుర్గంటౌన్: పట్టణంలో తప్పిపోయిన ఓ బాలుడిని ఉపాధ్యాయులు గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. విజయవాడ ప్రాంతానికి చెందిన గుల్జార్‌బీ తన ఆరేళ్ల కుమారుడు జహీర్‌తో కలసి రాయదుర్గంలోని కోట ఏరియాలో ఉన్న బంధువుల ఇంటికి రెండు రోజుల క్రితం వచ్చింది. శుక్రవారం ఉదయం జహీర్ ఇంటి బయట ఆడుకుంటూ తప్పిపోయి బళ్లారి బస్టాండ్ వద్దకు చేరుకుని, బళ్లారికి వెళ్లే బస్సు ఎక్కి కూర్చున్నాడు. ఒంటరిగా ఉన్న బాలుడిని విధుల నిమిత్తం కల్యం గ్రామానికి వెళుతున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు సుమతి, మోహన్‌రెడ్డి గమనించి ఆరా తీశారు. బాలుడు తప్పినట్లుగా నిర్ధారించుకున్న వారు.. కల్యం గ్రామం రాగానే తమతో పాటు బస్సులో నుంచి దింపి పాఠశాలకు పిలుచుకెళ్లి, విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఈ అంశాన్ని కోట ఏరియాలోని మహిళ చూసి బాలుడిని గుర్తించి సమాచారం ఇవ్వడంతో బంధువులతో కలసి తల్లి కల్యం గ్రామానికి వెళ్లి ఉపాధ్యాయులను కలిసింది. సురక్షితంగా బాలుడిని అప్పగించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపింది.

కోర్టుల తరలింపు ప్రక్రియను తక్షణమే ఆపేయాలి



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: సీబీడీ, ఎన్‌డీపీఎస్ కోర్టుల తరలింపు ప్రక్రియను తక్షణమే ఆపేయాలంటూ న్యాయవాదులు నినదించారు. సీబీడీ కోర్టును కర్నూలులోని ఏసీబీ కోర్టుకు, ఎన్‌డీపీఎస్ కోర్టును తిరుపతి కోర్టుకు బదలాయించేలా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓలను నిరసిస్తూ జిల్లా కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 9వ రోజూ కొనసాగాయి. ప్రభుత్వం జారీ చేసిన జీఓలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో బి.ఈరమనప్ప, ఎమ్.సతీష్‌కుమార్, డి.సూర్యచంద్రయాదవ్, జీసీ ప్రకాష్, ఎం.చంద్రశేఖర్, ఎం.లోకేష్, ఎ.శ్రీకాంత్, టి.సురేష్, వంశీనాయక్, బి.గౌతమ్ రాజు, బి.పెద్దిరెడ్డి, సి.అశోక్, ఎం.పురుషోత్తం, ఎస్.సుదర్శనరెడ్డి, సూర్యతేజ, రమేష్, కృష్ణ, నరసింహ పాల్గొన్నారు. ఆందోళనకు ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ఓ విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు

అనంతపురం అర్బన్: భూ సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో చేపట్టిన రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు అందిన దరఖాస్తులకు పరిష్కారం చూపిన తీరే ఇందుకు నిదర్శనం. ఈ నెల 6న ప్రారంభించిన రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీన ముగుస్తాయి. ఇప్పటి వరకు 116 గ్రామాల్లో సదస్సులు పూర్తి కాగా, 12,355 మంది హాజరయ్యారు. అందిన 1,896 అర్జీల్లో కేవలం 39 అర్జీలను మాత్రమే పరిష్కరించారు. దీన్నిబట్టి చూస్తే రెవెన్యూ సదస్సులు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనేది స్పష్టమవుతోంది.

ఎడారి నివారణకు డీపీఆర్



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కణేకల్లు/బొమ్మనహాళ్: కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఇసుక దిబ్బల విస్తరణతో నెలకొన్న ఎడారి ఛాయలను రూపుమాపేందుకు డీపీఆర్ రూపొందిస్తున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు. ఇండో జర్మన్ ప్రాజెక్ట్ ప్రతినిధులు సతీష్, కుసుమతో కలసి శుక్రవారం ఆయన కణేకల్లు మండలం గరుడచేడు, తుంబిగనూరు, బిదరకుంతం, బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు, మాల్యం, తదితర గ్రామాల్లో విస్తరించిన ఇసుక దిబ్బలను పరిశీలించారు. ఇసుక దిబ్బలు విస్తరణకు కారణాలు, దీని వల్ల కలిగే నష్టాలు, జనజీవనానికి తలెత్తిన ఇబ్బందులపై స్థానిక అధికారులు, రైతులతో ఆరా తీశారు. అనంతరం విలేకరుల సమావేశంలో పీడీ మాట్లాడారు. ఇసుకదిబ్బల నివారణకు ఎలాంటి చర్యలు చేపడితే ఉపయోగకరంగా ఉంటుందో నివేదిక సమర్పించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారన్నారు. దీంతో ఈ ప్రాంతాలను సందర్శించి హార్టికల్చర్, మైక్రో ఇరిగేషన్, అగ్రికల్చర్‌తోపాటు వివిధ శాఖల సమన్వయం చేసుకుని చేపట్టనున్న పనులకు డీపీఆర్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడీ ఆయేషా, ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు, ఏపీఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ సేవల్లో చోటు చేసుకుంటున్న అవినీతి, అక్రమాలు, సమాజంలో సాగుతున్న దౌర్జన్యాలను ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ కొడవండ్ల డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన ప్రభుత్వ సేవలు అందేలా చేయడంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. అలాంటి జర్నలిస్టులపై దాడులు చేయడం తగదన్నారు. వైఎస్సార్ జిల్లాలో సాక్షి జర్నలిస్టులపై బహిరంగంగా దాడిచేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు.

హత్యకేసులో ఇద్దరికి యావజ్జీవం

- అనంతపురం మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సంచలన తీర్పు



ముద్దాయిలను జైలుకు తరలిస్తున్న దృశ్యం

అనంతపురం: యువకుడిని హత్య చేసిన కేసులో ఇద్దరికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివరాలు... అనంతపురం నగరంలోని కోవూరునగర్‌లో నివాసముంటున్న రెడ్డి మణికంఠ, లింగుట్ల రాజశేఖర్ నాయుడు, షేక్ నబీరసూల్ స్నేహితులు. మణికంఠ ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. ముగ్గురికీ మద్యం సేవించే అలవాటు ఉంది. తనకు మద్యం ఇప్పించాలంటూ తరచూ స్నేహితులు మణికంఠ ఇబ్బంది పెట్టేవాడు. ఇప్పించకపోతే గొడవ పడేవాడు. దీంతో అసహనానికి గురైన రాజశేఖర్‌నాయుడు, నబీరసూల్ 209, డిసెంబర్ 21న మద్యం తాగుదామంటూ మణికంఠను పిలుచుకుని బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామ సమీపాన పొలాల్లోకి వెళ్లారు. అక్కడ మద్యం సేవించిన అనంతరం మత్తులో ఉన్న మణికంఠ తలపై సుత్తితో బాది హతమార్చారు. అనంతరం అక్కడే గొయ్యి తీసి మృతదేహాన్ని పాతిపెట్టారు. అయితే తన కుమారుడు కనిపించడం లేదంటూ మణికంఠ తల్లి శాంతికుమారి చేసిన ఫిర్యాదు మేరకు అప్పటి నాల్గోపట్టణ సీఐ రాజశేఖర్ మిస్సింగ్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన కత్తి శ్రీనివాసులు దర్యాప్తు ముమ్మరం చేసి మణికంఠను హత్య చేసినట్లుగా నిర్ధారించుకున్నారు. పక్కా ఆధారాలతో రాజశేఖరనాయుడు, నబీరసూల్‌ని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అప్పటి నుంచి కేసు వాదనలు జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టులో కొనసాగుతూ వచ్చాయి. పది మంది సాక్షులను న్యాయస్థానం విచారించింది. నేరం రుజువు కావడంతో ఇద్దరికీ యావజ్జీవ కఠిన కారాగా శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సి. సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదనలను ఏపీపీ ఈశ్వరమ్మ వినిపించారు.

సర్వ మతాల సారాంశం ఒక్కటే

- దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా
- ఘనంగా సర్వమత సమ్మేళనం



గంధాన్ని మోసుకెళుతున్న సజ్జద్‌బాబా

పెనుకొండ: సర్వ మతాల సారాంశం ఒక్కటేనని, భగవంతుడు ఒక్కడే అని పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా పేర్కొన్నారు. పెనుకొండలోని బాబయ్య స్వామి దర్గా ఆవరణలో శుక్రవారం రాత్రి నిర్వహించిన సర్వమత సమ్మేళనం ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏ మతం వారైనా దేవుడిని పూజించడం సర్వ సాధారణమన్నారు. అయితే ఇతర మతస్తుల ఆచార వ్యవహారాలు, సంస్కృతిపై అసహనం పెంచుకోవడం భావ్యం కాదన్నారు. ఏ మతం వారయినా అందరినీ సమానంగా ప్రేమించాలని, ప్రేమ... అనురాగం... ఆప్యాయతలతో జీవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అని మహిమాన్వితుడు బాబయ్య స్వామి నాడే బోధించారని గుర్తు చేశారు. సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు శాంతి సందేశాలను వినిపించారు. బాబయ్య స్వామి మహిమలను కొనియాడారు. అనంతరం పలువురికి దర్గా తరపున సన్మానం చేసారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా మొదటి గంధం వేడుకలు

శుక్రవారం రాత్రి బాబయ్య స్వామి మొదటి గంధం వేడుకలు ఘనంగా జరిగాయి. సజ్జద్‌బాబా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సజ్జద్‌బాబా, ఆయన సోదరులు పాల్గొన్నారు. రాత్రి 10 గంటల సమయంలో డప్పు వాయిద్యాల నడుమ తమ గృహం నుంచి గంధాన్ని తలపై ఉంచుకుని కోలాహలంగా బాబయ్యస్వామి దర్గాకు చేరుకుని మహాసమాధికి అవనతం చేశారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పక్కీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.


వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లను కలెక్టరేట్‌లోకి అనుమతించకపోవడంతో వన్‌టౌన్‌ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్‌తో మాజీ ఎంపీ రంగయ్య వాగ్వాదం


ర్యాలీగా వస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మహిళా నాయకురాళ్లు


వైఎస్సార్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, విశ్వ తదితరులు


ప్లకార్డులతో ర్యాలీకి బయలుదేరిన గుంతకల్లు మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ నైరుతిరెడ్డి


వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

కదిలొచ్చిన కర్షక లోకం..

ర్యాలీ విజయవంతం

అనంతపురం కార్పొరేషన్‌: రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌ సీపీ’ కార్యక్రమం విజయవంతమైంది. శుక్రవారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి, రాప్తాడు నియోజకవర్గాల నుంచి రైతులు, వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వివిధ వాహనాల్లో పెద్ద ఎత్తున అనంతపురం చేరుకున్నారు. జెడ్పీ కార్యాలయం వద్దకు ఒక్కసారిగా పార్టీ శ్రేణులు చేరుకోవడంతో సందడి నెలకొంది. జెడ్పీ నుంచి ప్రారంభమైన ర్యాలీ.. సప్తగిరి సర్కిల్‌, సూర్యనగర్‌, సంగమేష్‌ సర్కిల్‌ మీదుగా కలెక్టరేట్‌ వరకు సాగింది. మొదటి నుంచి చివరి వరకు ర్యాలీ జనసంద్రాన్ని తలపించింది. భారీ సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావడం విశేషం. చంద్రబాబు.. హామీలన్నీ నెరవేర్చు.. రైతులను మోసం చేయొద్దని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్‌ ఖాగజ్‌ రిజ్వాన్‌, అగ్రికల్చర్‌ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్‌ వెన్నపూస రామచంద్రారెడ్డి, పంచాయతీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్‌ జిల్లా కోఆర్డినేటర్‌ మెన్నం శివరామిరెడ్డి, పార్టీ నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌ మోహన్‌రెడ్డి, సైఫుల్లాబేగ్‌, ఎగ్గుల శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్‌ పీరా, శ్రీదేవి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్‌, లాలూ, అనిల్‌కుమార్‌రెడ్డి, టీపీ చంద్రమోహన్‌రెడ్డి, శేఖర్‌బాబు, నాయకులు చింతకుంట మధు, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, ఫయాజ్‌, పామిడి వీరాంజనేయులు, మీసాల రంగన్న, పెన్నోబులేసు, బలరాం, హనుమంతు, మాల్యవంతం మంజుల, అమర్‌నాథ్‌రెడ్డి, రాధాకృష్ణ, భారతి, శోభారాణి, శోభాబాయి, దేవి, జావెద్‌, సాకే కుళ్లాయస్వామి, సుజాత రెడ్డి, పార్వతి పాల్గొన్నారు.


అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దృశ్యం


రైతులకు న్యాయం చేయాలని డిమాండ్‌ చేస్తున్న పార్టీ శ్రేణులు

క్లుప్తంగా

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు: మండల కేంద్రంలో శుక్రవారం మన గ్రోమోర్‌ ఆధ్వర్యంలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మీనారాయణ, మన గ్రోమోర్‌ జెడ్‌ఎమ్‌ఎమ్‌ చక్రధర్‌, ఏఎమ్‌ఆర్‌ఓ నాయుడు, ఏఎమ్‌ఎమ్‌ తిరుపతి రామ్‌, మేనేజర్‌ మహానంది తదితరులు పాల్గొన్నారు.

రేపు రాయలసీమ మహాకవి సమ్మేళనం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాంస్కృతిక వేదిక ప్రతినిధులు

అనంతపురం కల్చరల్‌: రాయలసీమ సాంస్కృతిక ఉద్యమంలో భాగంగా మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా మహాకవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు కేంద్ర అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్‌ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తెలిపారు. శుక్రవారం 140 మంది కవులతో సీమకు ఖ్యాతి తెచ్చిన మహనీయుల సాహిత్య కవనంతో సాగే కవి సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సాయిబాబా కళాశాల కళాప్రాంగణంలో రాయలసీమ చిత్రలేఖన ప్రదర్శన, పుస్తకాల ప్రదర్శన తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి, మెట్టుపల్లి సుదర్శనరెడ్డి స్మారకంగా కవి సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవికుమార్‌, నాగేశ్వారెడ్డి, వన్నూరు సాబ్‌, స్వామి, తమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి


విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్‌: స్థానిక సాయినగర్‌లోని నారాయణ జూనియర్‌ కళాశాల 10వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అంబేడ్కర్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలకు నారాయణ కళాశాలల కోర్‌ డీన్‌ బద్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డీజీఎం వెంకటరామి రెడ్డి, ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌ బాబు, ఏజీఎం చెన్నకేశవులు మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో ఇంటర్‌ చాలా విలువైందన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా విలువైన జీవితాలను నాశనం చేసుకుంటారన్నారు. తాత్కాలిక సంతోషాలను వదిలపెట్టాలని సూచించారు. అనంతరం ఉత్తమ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. తర్వాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో వివిధ సినిమా పాటలకు విద్యార్థులు డ్యాన్సులతో అదరగొట్టారు.

చిరుద్యోగులపై బ్రహ్మాస్త్రం

- కేఎస్‌ఆర్‌లో వాచ్‌మెన్‌, ఆయాల తొలగింపునకు తీవ్ర ఒత్తిళ్లు
- వారితో ఎలాంటి సమస్య లేదంటున్న హెచ్‌ఎం, స్కూల్‌ మేనేజ్‌మెంట్‌ కమిటీ చైర్మన్‌
- కలెక్టర్‌ను కలిసి మొర పెట్టుకున్న బాధితులు
- కొత్తవారిని సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే దగ్గుపాటి లేఖ

అనంతపురం ఎడ్యుకేషన్‌: నగరంలోని కేఎస్‌ఆర్‌ ప్రభుత్వ బాలికల పాఠశాలలో దాదాపు పదేళ్లుగా పని చేస్తున్న అటెండరు, ఇద్దరు ఆయాలను తొలగించాలంటూ ఎంఈఓ–2, ప్రధానోపాధ్యాయుడిపై అధికార పార్టీ నేతలు తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు చేస్తున్నారు. చాలీచాలనీ జీతాలతో నెట్టుకొస్తున్న చిరుద్యోగులపై వ్యవహరిస్తున్న తీరు విద్యాశాఖ వర్గాల్లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది. వివరాలు.. వేలాదిమంది విద్యార్థినులు ఉన్న కేఎస్‌ఆర్‌ ప్రభుత్వ బాలికల పాఠశాలలో వాచ్‌మెన్‌గా నాగరాజు, ఆయాలుగా లక్ష్మి, సరోజ పని చేస్తున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ, తరగతి గదులు, ఉపాధ్యాయుల స్టాఫ్‌ గదులు శుభ్రం చేసేందుకు తీవ్ర ఇబ్బంది ఉండడంతో పదేళ్ల కిందట నెలకు ఒక్కొక్కరికి రూ. వెయ్యి చెల్లిస్తూ అప్పటి హెచ్‌ఎం తన సొంత నిధులు వినియోగిస్తూ వచ్చారు. తర్వాత వచ్చిన హెచ్‌ఎంలు వారిని కొనసాగిస్తూ వచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అటెండర్లు, ఆయాలకు రూ. 6 వేలు గౌరవవేతనం ఇస్తూ వచ్చింది. అప్పటి నుంచి వీరికి ప్రతి నెలా రూ. 6 వేలు అందుతోంది.


కేఎస్‌ఆర్‌ బాలికల పాఠశాల

చక్రం తిప్పుతోన్న సంబంధం లేని టీచరు

స్కూల్‌ నిర్వహణలో ఏమాత్రం సంబంధం లేని ఓ టీచరు కేఎస్‌ఆర్‌ స్కూల్‌లో చక్రం తిప్పుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ‘ప్రభుత్వం మాది. నేను చెప్పినట్లు జరగాలి. నాకు నచ్చని వారు పాఠశాలలో ఉండకూడదు’ అంటూ బహిరంగంగానే హెచ్చరించినట్లు తోటి ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం పని చేస్తున్న వాచ్‌మెన్‌, ఆయాలు ఉండకూడదని వారిస్థానంలో తాను చెప్పిన వాళ్లను తీసుకోవాలంటూ హెచ్‌ఎంపై ఒత్తిడి చేశారు. వాచ్‌మెన్‌, ఆయాల సేవలపై అటు హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌, ఉపాధ్యాయులు సంతృప్తిగా ఉన్నారు. ఎలాంటి వివాదాలు లేవు. అయినా వారిపట్ల వ్యతిరేక భావనతో ఉన్న టీచరు తన సామాజిక వర్గానికి చెందిన వారి ద్వారా స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో ఏకంగా లేఖ ఇప్పించడం కలకలం రేపుతోంది. కొత్తవారిని ముగ్గురిని సిఫార్సు చేస్తూ ఎంఈఓ–2కు ఎమ్మెల్యే లేఖ రాశారు.

కలెక్టర్‌ను కలిసిన బాధితులు

సదరు టీచరు తమను అనవసరంగా ఇబ్బంది పెడుతున్నారంటూ వాచ్‌మెన్‌, ఆయాలు ఇటీవల కలెక్టర్‌ వినోద్‌ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్‌ ఆదేశాలతో డీఈఓ విచారణ చేపట్టారు. హెచ్‌ఎం మొదలుకుని మెజార్టీ టీచర్లు, ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్‌ అందరూ ప్రస్తుతం పని చేస్తున్న వాచ్‌మెన్‌, ఆయాలను కొనసాగించాలంటూ ముక్తకంఠంతో చెప్పారు. పైగా పాఠశాలలో గందరగోళ పరిస్థితులకు కారణమైన టీచరు వ్యవహారశైలిపై ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా ఈ విషయమై ఎంఈఓ–2 సరితారాణిని వివరణ కోరగా.. వాచ్‌మెన్‌, ఆయాలను కొత్త వారిని సిఫార్సు చేస్తూ ఎమ్మెల్యే లేఖ పంపారన్నారు. ఈ అంశం తన పరిధిలో లేదని స్పష్టం చేశారు. హెచ్‌ఎం నారాయణ మాట్లాడుతూ... ప్రస్తుతం పని చేస్తున్న వారిపై ఎలాంటి ఆరోపణలు లేవన్నారు. పాఠశాలను నమ్ముకుని పదేళ్లుగా వారు పని చేస్తున్నారన్నారు. ఎస్‌ఎంసీ చైర్మన్‌ కూడా ప్రస్తుతం పని చేస్తున్న వారే ఉండాలంటూ స్పష్టం చేశారన్నారు.

కొత్త నోటిఫికేషన్‌ ఇవ్వాలి

అనంతపురం ఎడ్యుకేషన్‌: సమగ్ర శిక్ష సెక్టోరియల్‌ పోస్టుల భర్తీకి సంబంధించి పాత నోటిఫికేషన్‌ రద్దు చేసి కొత్తగా నోటిఫికేషన్‌ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని రిజర్వేషన్‌ ఎంప్లాయిస్‌ ఫెడరేషన్‌ నాయకులు కోరారు. ఈ మేరకు అనంతపురంలో శుక్రవారం జాయింట్‌ కలెక్టర్‌ శివ నారాయణ శర్మను ఆర్‌ఈఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌.రామచంద్ర, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ ఎండి నాగభూషణ, జిల్లా అధ్యక్షుడు ముత్యాలరాజు, రాష్ట్ర స్టీరింగ్‌ కమిటీ రామకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు కోటి మల్లేష్‌ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్‌ ఆఫీసర్ల భర్తీ ప్రహసనంగా మారిందన్నారు. బలహీన వర్గాలకు ఎలాంటి న్యాయం చేయకుండా వారిని అనర్హులుగా ప్రకటించి, అస్మదీయులకు పెద్దపీట వేశారని ఆరోపించారు. జాబితా తయారు చేసి ఆమోదం కోసం విద్యాశాఖ కమిషనర్‌కు పంపారన్నారు. గతంలో పనిచేసి అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొన్న వారిని ఎంపిక చేసినట్లు తెలిసిందన్నారు. జాబితా ఎంపికలో ఇక్కడ డీఈగా పని చేసిన వరలక్ష్మి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆమెపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. అలా కాకుండా నెలలు సాగదీసి పాత జాబితానే ఆమోదించే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. కలెక్టర్‌, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.


జేసీ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌ఈఎఫ్‌ నాయకులు

ఇద్దరిపై చీటింగ్‌ కేసు

అనంతపురం: ఐఐఎఫ్‌ఎల్‌ బ్యాంక్‌లో గతంలో పని చేసిన ఇద్దరు ఉద్యోగులపై చీటింగ్‌ కేసు నమోదైంది. వివరాలు.. రషీద్‌ఖాన్‌, మెహర్‌బాషా గతంలో ఈ బ్యాంకులో పని చేశారు. వీరి వ్యవహార శైలి నచ్చక ఉద్యోగం నుంచి తొలగించారు. వీరు పని చేస్తున్న సమయంలో ఏకంగా 600 గ్రాముల బంగారాన్ని స్వాహా చేశారు. రూ.23 లక్షలు విలువ చేసే మొత్తం అక్రమాలకు పాల్పడ్డారు. ఇటీవల ఐఐఎఫ్‌ఎల్‌ బ్యాంకులో జరిగిన ఆడిటింగ్‌లో ఈ మోసం బయటపడింది. గతంలో పని చేసిన రషీద్‌ ఖాన్‌, మెహర్‌ బాషా ఈ బంగారాన్ని మాయం చేసినట్లు నిర్ధారించారు. ఈ విషయంపై అనంతపురం వన్‌టౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో మేనేజర్‌ ఆంజనేయులు ఫిర్యాదు చేశారు. రూ.13 లక్షల విలువ చేసే మొత్తం ఒక్క రోజులోనే రికవరీ అయింది. తక్కిన రూ.10 లక్షలు వెనక్కి చెల్లించలేదు. దీంతో రషీద్‌ఖాన్‌, మెహర్‌ బాషాలపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్‌ యాదవ్‌ తెలిపారు.

కూటమి ప్రచార ఆర్భాటం

అనంతపురం అర్బన్‌: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటి వరకు రైతులకు చేసిన మేలు చేసింది శూన్యం. హామీ ఇచ్చిన విధంగా అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం ఇవ్వలేదు. ఇక ఉచిత బీమాకు పాతరేశారు. ఈ విషయం ఏ రైతును అడిగినా చెబుతారు. తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే క్రమంలో కూటమి నాయకులు పడుతున్న తంటాలు చూసిన ప్రజలు.. వారిది ‘ఇదో.. ఆనందం’ అంటూ నవ్వుకున్నారు. శుక్రవారం కలెక్టరేట్‌ ఎదుట రైతు సమస్యలపై ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ కార్యక్రమం నిర్వహించారు. దీన్ని జీర్ణించుకోలేని కూటమి నాయకులు తమదైన రీతిలో ఫ్లెక్సీ ప్రచారానికి తెరతీశారు. రైతులకు ప్రభుత్వం చేసింది ఏమీ లేదనే విమర్శలు బహిరంగంగా వినిపిస్తున్నా.. రైతులకు తమ ప్రభుత్వం అన్ని చేస్తోందనే తరహాలో ప్రచారం కోసం కలెక్టరేట్‌ ఎదుట ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించింది.

మాజీ ఎంపీ రంగయ్య చురకలు..

కలెక్టరేట్‌ ఎదుట కూటమి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై మాజీ ఎంపీ తలారి రంగయ్య తనదైన శైలిలో చురకలు అంటించారు. ‘రైతులకు గిట్టుబాటు ధర గతంలో కంటే ఎక్కువ ఇస్తున్నామంటూ కూటమి నాయకులు కలెక్టరేట్‌ వద్ద ఫ్లెక్సీ కట్టారు. అందరూ వీటిని గమనించి మీ సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకోండి. మీ గ్రామాలకు వెళ్లి కూటమి నాయకులు చెబుతున్నట్లుగా మద్దతు ధర అమలు వుతుందా? ఆ ధరతో పంట కొంటున్నారా? అని అడగండి’ అని సూచించారు. ‘అమలు కావడం లేదు. ఆ ధరకు ఎవరూ తీసుకోవడం లేదని చెబితే అదే విషయంపై మెసెజ్‌లు పెట్టండి.’ అంటూ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు.


కలెక్టరేట్‌ ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన దృశ్యం

పకడ్బందీగా సాగునీటి సంఘాల ఎన్నికలు

రాప్తాడు: సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్‌ విజయ కుమారి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సాగునీటి ఎన్నికలకు సంబంధించిన పోలింగ్‌ కేంద్రాల పీఓలు, ఏపీఓలు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్‌ మాట్లాడుతూ.. ఈనెల 14న మండలంలో 6 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వీటిలో భారీ నీటి పారుదల సంఘాలు రెండు, చిన్న నీటి పారుదల సంఘాలు 4 ఉన్నాయన్నారు. ఓటు హక్కు ఉన్న వారు పోలింగ్‌ స్టేషన్లలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

కృత్తిక మహా దీపోత్సవం

అనంతపురం కల్చరల్‌: అరుణాచల క్షేత్రంలో సాగే కృత్తిక దీపోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి అనంతలోనూ జరిగాయి. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్‌ గురుశేఖర బాబు నేతృత్వంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్తీక దీపాన్ని భక్తులు దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు నెయ్యితో అరుణాచలేశ్వరుడికి దీపాలను వెలిగించారు.



వైఎస్‌ జగన్‌ను కలిసిన భాను ప్రకాష్‌ రెడ్డి, హనుమంత రెడ్డి

వైఎస్‌ జగన్‌తో భేటీ

అనంతపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని శుక్రవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో ఎస్కేయూ వైఎస్సార్‌ విద్యార్థి విభాగం నాయకులు వై.భాను ప్రకాష్‌ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంత రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి విద్యార్థుల పట్ల వ్యవహరిస్తున్న తీరును వివరించారు. విద్యార్థులు పడుతున్న సమస్యలను వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

రైతు ద్రోహి సీఎం చంద్రబాబు

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌ రెడ్డి

రాప్తాడు: కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవసాయ రంగం కుదేలైంది. రైతాంగ సమస్యలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతు ద్రోహి అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌ రెడ్డి ధ్వజమెత్తారు. పార్టీ అధిష్టానం పిలుపుమేరకు శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ ర్యాలీకి వెళ్లేందుకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులతో కలసి బయలుదేరారు. మార్గమధ్యంలో మరూరులోని 44వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ ప్లాజా వద్దకు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున జై జగన్‌, జైజై జగన్‌, జై ప్రకాష్‌ రెడ్డి, జైజై ప్రకాష్‌ రెడ్డి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో రైతులకు తీరని అన్యాయం జరిగిందన్నారు.

పెట్టుబడి సాయం ఎక్కడ?

ఎన్నికల ముందు రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి.. ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్‌ జగన్‌ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో పరిహారం అందించామని గుర్తు చేశారు. రైతులు విత్తనాలు నాటడం మొదలుకుని పంట నూర్పి, గిట్టుబాటు ధర కల్పించే వరకూ అండగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంట నష్టపోయిన రైతులకు ఇన్సూరెన్స్‌ ఇచ్చినట్లు తెలిపారు. 2 వేల జనాభాకు ఒక రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఏ అవసరం వచ్చినా ఆదుకున్నామన్నారు. ప్రస్తుతం వర్షాల వల్ల ఖరీఫ్‌, రబీలో రైతులు నష్టపోయినా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మద్దతు ధర అసలే లేదని రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారన్నారు. రైతు భరోసా, ఇన్‌పుట్‌ సబ్సిడీ, సున్నా వడ్డీ తదితర పథకాలు అమలు చేయకుండా వంచించడమే కాకుండా ఇన్సూరెన్స్‌ భారం మోపి దగా చేస్తోందన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్ల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేదన్నారు. అన్నదాతకు అండగా నిలబడేందుకు తమ పార్టీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి రైతులకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ జూటూరు శేఖర్‌, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, సాకే చంద్ర, పసుపుల నరసింహ గౌడ్‌, చిరుతల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌ రెడ్డి

డీఈఓ కార్యాలయ ఏపీఓగా మంజు

అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ఏపీఓగా మంజునాథ్‌ను నియమించారు. ఇప్పటిదాకా ఏపీఓగా పని చేస్తున్న నాగరాజును ఏఎస్‌ఓగా నియమించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటిదాకా ఏఎస్‌ఓగా పని చేస్తున్న ఓబుళరెడ్డిని కళ్యాణదుర్గం నార్త్‌ స్కూల్‌కు పంపారు. అయితే ఈ నియామకాలను అత్యంత గోప్యంగా చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

భక్తిశ్రద్ధలతో హనుమద్‌ వ్రతాలు


అలంకరణలో హనుమంతుడు

అనంతపురం కల్చరల్‌: మార్గశిరంలో వచ్చే హనుమద్‌ వ్రతాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆంజనేయుడి నామస్మరణతో మందిరాలు మార్మోగాయి. పలు చోట్ల హనుమంతుడు సామూహికంగా ప్రత్యేక పూజలందుకున్నాడు. స్థానిక హౌసింగ్‌ బోర్డులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమద్‌ వ్రతాల్లో భాగంగా నిలువెత్తు మూలమూర్తికి తెల్లవారుజాము నుంచే పంచామృతాభిషేకాలు, చందన సహిత అర్చనలు, ఆకుపూజలు, విశేష అలంకార సేవలు జరిగాయి. 108 మందితో సామూహికంగా చాలీసా పారాయణం చేస్తూ వ్రతం ఆచరించారు. అలాగే కోర్టు రోడ్డులోని వరదాంజనేయ స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. భక్తులు బారులు తీరి స్వామిని దర్శించుకున్నారు. ఐదవ రోడ్డు, ఎర్రనేల కొట్టాలలో పంచముఖ ఆంజనేయ స్వామి, మారుతీ నగర్‌, ఇందిరా నగర్‌, పాతూరు మార్కెట్‌ వద్ద ఉన్న హండీ హనుమంతుడు హనుమద్‌ విశేష పూజలందుకున్నాడు.